నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 19 జూన్ 2025 | KAMAREDDY

## ఆకాశంలో అద్భుతం



వినీలాకాశంలో బుధవారం అద్భుతం చోటు చేసుకున్నది. సూర్యుడి చుట్టూ ఏర్పడిన వలయాకార దర్పణం చూపరులను విశేషంగా ఆకట్టుకున్నది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో ఈ అద్భుతం కనిపించగా, నమస్తే తెలంగాణ క్లిక్‌మనిపించింది.

– ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## సబ్ కలెక్టర్ తనయుడికి 'సర్కార్' వ్యాక్సిన్



బాన్సువాడ వంద పడకల మాతాశిశు దవాఖానను సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి బుధవారం సందర్శించారు. ఆర్ఎంవో కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తన కుమారుడికి వ్యాక్సిన్ వేయించారు.

– బాన్సువాడ, జూన్ 18

## ఆలోచన వినూత్నం..
# అందరికీ 'పుస్తకం'

కోటగిరి పాఠశాలలో బుక్ బ్యాంక్



పుస్తక నిధిలో భాగంగా పాఠశాలలో భద్రపరిచిన పుస్తకాలు

- పాఠ్య పుస్తకాల కొరత తీరుస్తున్న 'పుస్తక నిధి'
- కొత్తగా వచ్చే విద్యార్థులకూ అందుబాటులో బుక్స్

కోటగిరి, జూన్ 18: కోటగిరి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టి అమలుచేస్తున్నారు. పాఠశాలలో పుస్తక నిధి ఏర్పాటు చేసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం బడిబాట కార్యక్రమంలో భాగంగా నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు. కానీ ఈ పాఠశాలలో మాత్రం విద్యార్థులకు కొత్తవి అందిస్తూనే, గతేడాది తరగతులకు సంబంధించి పాత పాఠ్యపుస్తకాలు సేకరించి బుక్ బ్యాంకు ఏర్పాటు చేశారు. గతేడాది ఒక తరగతిలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రస్తుత తరగతి పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేస్తున్నది. ఒకవేళ కొత్తగా అడ్మిషన్లు వస్తే పుస్తకాల కొరత ఏర్పడుతుంది. 'పుస్తక నిధి' ఏర్పాటు చేయడంతో పుస్తకాల కొరతకు తావులేకుండా పోయింది.


### చదువుకు ఆటంకం కలుగొద్దని..

విద్యార్థులు పాఠ్యపుస్తకాలు లేక ఇబ్బందులు పడకూడదని కొన్నేండ్లుగా బుక్ బ్యాంక్ నిర్వహిస్తున్నాం. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు సేకరించి ఒక గదిలో భద్రంగా ఉంచుతున్నాం. తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియాలకు సంబంధించిన పుస్తకాలు సేకరిస్తున్నాం. విద్యార్థులతోపాటు పాలిటెక్నిక్, గురుకుల కళాశాలలో ప్రవేశాలకు లేదా ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి కూడా ఇస్తున్నాం.

**- నాందేడ్ల శ్రీనివాసరావు,**
**ప్రధానోపాధ్యాయుడు, కోటగిరి**

## స్పష్టతనివ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

- గడిచిన యాసంగిలో అరకొరగానే నగదు జమ
- మొదటి రెండు సీజన్లలో అమలుకు నోచుకోని రైతుభరోసా
- ఈ వానాకాలంలో అందరికీ వర్తించేలా నిధుల సర్దుబాటు
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే సర్కారు మయాజాలం



గత సీజన్లలో జమ కాని పెట్టుబడి సాయం

## 'భరోసా' బకాయిలపై
# దాటవేత!

నిజామాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయడంలో ఘోరంగా విఫలమైంది. పథకం అమలులో మాయాజాలం చేస్తూ రైతులను మభ్యపెడుతున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొత్తం నాలుగు పంట కాలాలు వచ్చాయి. ఇందులో మూడు పంట కాలాలు ముగిశాయి. రెండు యాసంగి సీజన్లు, మరో రెండు వానాకాలం సీజన్లు వచ్చినప్పటికీ రైతు భరోసా అమలైంది కేవలం రెండు సీజన్లకు మాత్రమే కావడం గమనార్హం. అమలైన పంట కాలాల్లోనూ ఒక సీజన్‌లో అరకొరగానే పెట్టుబడి సాయం అందించారు. మరో సీజన్‌కు సంబంధించిన రైతుభరోసాను ఇప్పుడు అందిస్తున్నారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే వానాకాలం– 2025లో రైతుభరోసాను సంపూర్ణంగా అమలు చేసేందుకు సర్కారు సిద్ధమైంది. ఇందుకోసం ప్రభుత్వ బాండ్లను పెట్టి నిధులను సమీకరించింది. ఎలాంటి షరతుల్లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన విధంగానే ఈ సీజన్‌లో రైతుభరోసా సాయాన్ని జమ చేయడంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతున్నది. దీనిపై రైతుల్లోనూ చర్చ సాగుతున్నది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో రైతుల నుంచి వ్యతిరేకతను తగ్గించుకునేందుకు ప్రభుత్వం ఈ ప్రయత్నాలు చేస్తున్నట్లు పలువురు భావిస్తున్నారు. రైతులకు మేలు చేయాలనే చిత్తశుద్ధి రేవంత్ రెడ్డి సర్కారుకు ఉండి ఉంటే, యాసంగిలో అరకొరగా అందించిన పెట్టుబడి సాయం మాటేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 2023 యాసంగి, 2024 వానకాలం రైతుభరోసాపై స్పష్టత ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వీటికి కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం ఇవ్వలేక చతికిల పడుతున్నది.


### స్థానిక పోరుతో హస్తం పార్టీ చతికిల బడడం ఖాయం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాలేదు.దర్జాగా సాగు బాటలో విజయం సాధించారు. కాలంతో సంబంధం లేకుండా సాగు నీరు, నిరంతర విద్యుత్, మద్దతు ధరకు పంటల కొనుగోళ్లు, ఎరువులు, విత్తనాల పంపిణీ, రైతు బంధు సాయం సక్రమంగా అమలైంది. రైతులకు వెలుగు జిలుగులు ప్రసాదించగా ఇప్పుడంతా గడ్డు కాలమే దాపురించింది. ఇలాంటి పరిస్థితిలో స్థానిక సంస్థల పోరులో కాంగ్రెస్ పార్టీ చతికిల బడడం ఖాయంగానే కనిపిస్తున్నది. రైతులంతా ఓటు అనే ఆయుధంతో అధికార పార్టీకి బుద్ధి చెప్పాలని యోచిస్తున్నట్లుగా తెలుస్తున్నది.




### సాగును భారంగా మార్చిన సర్కార్

రైతుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకుని లబ్ధి పొందడానికి ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కుయుక్తులను ప్రజలు గమనించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా హస్తం పార్టీ హామీలు, వారి మాటలను నమ్మి ఓటేశారు. ఏడాదిన్నర కాలంలో ప్రజా పాలనలో ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. స్వీయ అనుభవంలో ప్రజలంతా ఇక్కట్లు ఎదుర్కొంటున్న తీరు వాడవాడకు తెలిసి పోయింది. రైతులకు సాగు బాటలో సాయం అందలేదు. వడ్ల కొనుగోళ్లలో వేగం లేక కర్షకులు చతికిల పడ్డారు. బోనస్ రూ.500 ఇస్తామని చెప్పి యాసంగిలో రూ.499 కోట్లు ఉమ్మడి జిల్లా రైతులకు బకాయిలు చెల్లించలేదు. రైతుభరోసా ఎకరానికి ఏటా రూ.15వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి కేవలం రూ.12వేలకు పరిమితం చేశారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందడం లేదు. జీలుగ విత్తనాల ధరలను అమాంతం మూడు రెట్లు పెంచారు. సరిపడా జీలుగ విత్తనాలు సరఫరా చేయకపోవడంతో విక్రయకేంద్రాల వద్ద రైతులు బారులు తీరాల్సిన దుస్థితి ఏర్పడింది. సాగు కాలంలో రైతన్నలు పడుతున్న పాట్లు పదేండ్ల క్రితం నాటి సమైక్య పాలనను మరోసారి గుర్తుకు చేసింది.



### హామీలన్నీ గాలికి..

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కుట్రలు, కుతంత్రాలతో ఓట్లను రాబట్టుకున్నది. దేవుళ్లపై ఒట్టు వేసి రైతు రుణమాఫీ చేస్తామంటూ ప్రతి ప్రచారసభ వేదికలపై స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనలు చేశారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన ఎన్నికల సభలో బాసర సరస్వతీ అమ్మవారిపై ప్రమాణం చేశారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే రుణమాఫీ పూర్తి చేస్తామని ఢంకా బజాయించి చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు జరిగి దాదాపుగా ఏడాది గడిచినా ఇప్పటివరకూ అతీగతీ లేకుండా పోయింది. హామీలన్నీ గాలికి కొట్టుకుపోయాయి. అరకొరగానే రుణమాఫీ చేసి మమ అనిపించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో లక్షలాది మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారంతా దిక్కూ మొక్కూ లేకుండా పోయారు. అర్హతలు ఉన్నప్పటికీ రుణాలు రద్దు కాకపోవడంపై అయోమయానికి గురవుతున్నారు. రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మరో గిమ్మిక్కుతో ముందుకువస్తున్నది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వేసిన పాచికనే మరోసారి ప్రయోగిస్తున్నది. అబద్ధపు హామీలు, కుట్రలు, కుతంత్రాలతో రైతులను తమవైపు తిప్పుకునేందుకు తంటాలు పడుతున్నది. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగి జూన్ 16న రైతుభరోసాను అమలుకు శ్రీకారం చుట్టారు. బకాయిల మాట మాత్రం ఎత్తకపోవడం గమనార్హం. యాసంగిలో పెట్టుబడి సాయం అందని రైతులకు తీపి కబురు చెబుతారనుకుంటే నిరాశ మిగిలింది.

## పిచ్చికుక్క స్వైర విహారం

**ధర్పల్లిలో 13 మందిపై దాడి..**




గాయాలను చూపిస్తున్న బాధితులు

ధర్పల్లి, జూన్ 18 : మండల కేంద్రంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేస్తున్నది. మనిషి కనిపిస్తే చాలు వెంటపడి దాడి చేస్తున్నది. దీంతో పెద్దలు, చిన్నారులు బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. మండల కేంద్రంలోని అంగడీబజార్‌లో నరేందర్ అనే వ్యక్తిపై బుధవారం పిచ్చికుక్క దాడి చేసింది. అతడితోపాటు వివిధ కాలనీల్లో ఉన్న సుజాత, వరుణ్, హర్షిత్, రాజశేఖర్, సయ్యద్ రెహన్, ఒల్లెపు నరేందర్, రిత్విక్‌రెడ్డి, చందర్‌రెడ్డి, రాకేశ్, భాగ్య, రమాదేవి, ఉదయ్ ఇలా 13 మందిని కరిచింది. దీంతో బాధితులందరూ స్థానిక ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. దవాఖానలో చికిత్స అందించడానికి ఏఎన్ఎం, సిబ్బంది తప్ప వైద్యులు లేకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పలువురిపై దాడిచేసిన పిచ్చి కుక్కను స్థానికులు వెంబడించి హతమార్చారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరారు.

## పోచారం కాలువలోకి
# దూసుకెళ్లిన కారు

**ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు**



పోచారం కాలువలో బోల్తాపడిన కారు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 18 : మండలంలోని మల్లయ్యపల్లి గ్రామశివారులో ఉన్న పోచారం కాలువలో ఓ కారు బోల్తాపడిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మెదక్ జిల్లా పాపన్నపేట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. మల్లయ్యపల్లి శివారు వద్దకు రాగానే కారు పోచారం కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు చికిత్సపొందుతూ మృతిచెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి. హైవే విస్తరణ పనులు కొనసాగుతుడడంతో సుమారు 40 ఫీట్ల గుంతను తవ్వారు. రాత్రివేళ అక్కడ వెలుతురు సరిగ్గా లేకపోవడం, సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కారు ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తున్నది. పోలీసులు, 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను బయటికి తీసి ఎల్లారెడ్డి దవాఖానకు తరలించారు.

# మళ్లీ ఆయనకే ఇన్‌చార్జి బాధ్యతలా?




- గతంలో సదరు వ్యక్తిపై ఆరోపణలు
- నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియామకం
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు

నిజాంసాగర్, జూన్ 18: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో గతంలో జరిగిన ఓ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తికి మళ్లీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించడంపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతున్నది. విద్యాలయంలో గతేడాది పలువురు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు ఉపాధ్యాయులపై పోక్సో చట్టం కింద కేసు నమోదై, రిమాండ్‌కు వెళ్లి వచ్చారు. ఆ సమయంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ గా ఉన్న మను యోహాన్ ఘటనకు సంబంధించి సమాచారం ఇవ్వకపోవడంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను అక్కడి నుంచి బదిలీ చేశారు. తాజాగా 2025 విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో మళ్లీ ఆయనకే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించడంపై విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తికి మళ్లీ అదే స్థానంలో బాధ్యతలు అప్పజెప్పడం ఎంతవరకు సబబని మండిపడుతున్నారు. కాగా..బుధవారం ముగ్గురు అధికారులతో కూడిన బృందం విచారణకు వచ్చినట్లు సమాచారం.

## మాదకద్రవ్యాల వినియోగంతో..
# భవిష్యత్తు అంధకారం




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి, అధికారులు

వినాయక్ నగర్, జూన్ 18: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం అంధకారమవుతుందని నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి అన్నారు. యువత భవిష్యత్తు బాగుండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) నేపథ్యంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ రూపొందించిన 'జీవితంలో డ్రగ్స్ కు నో చెప్పడం ఎలా?' అనే పోస్టర్లను జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన చాంబర్‌లో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు, అదనపు డీసీపీ బస్వారెడ్డితో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. 2025 సంవత్సరంలో డ్రగ్స్ నివారణ, చికిత్సపై న్యాయ వ్యవస్థ దృష్టి సారిస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువత, ప్రజలు మాదక ద్రవ్యాలను అలవాటు చేసుకోరాదని సూచించారు.

యువతరం దేశ అభివృద్ధి, ప్రగతికి తమ మేధస్సుతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ నెల 26న జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో విద్యార్థులు, యువతతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

